# 'ఆత్మకథనము'

ఆకుండి వేంకటశాస్త్రిగారు

'ఓం' అని నాకథ మొదలుపెట్టుటకుముందు, ప్రపంచములో నే ననేకుల యధీనమునందుండి వారికి సేవచేయుచు నేయున్నానని చెప్ప నవసరములేదు. కాని నా యజమానులకే నా జన్మకథ తెలిసియుండదని నే ననుకొందును. నేను క్రీ. శ. 1873 సం వత్సరమునకు పూర్వమే జనించితిని. నా తండ్రిని సి. లేథామ్ షోల్సందురు. అతఁడు మిల్ వాకీ కుటుంబమునకు జెందినవాఁడు. నన్ను కన్నందులకు నా తండ్రిని జనులెల్లరు నభినందించిరి. నా తండ్రి నా జాతకము వ్రాయించి జాగ్రతపెట్టనందున నే నే తేదీని జన్మించితినో సరిగఁ జెప్పఁజాలను. నా తండ్రి మిగుల కఠినహృదయుఁడు. ఏలయన? ఏ తండ్రియు తన యాత్మజను నిష్కారుణముగ నొరుల కమ్మివేయఁడు. బహుశః అటుల నన్నన్యుని కమ్మివేయుటకుఁ గారణ మతని దారిద్ర్యమే యైయుండవచ్చును. నా తండ్రి హృదయమునఁగల పుత్త్రీవాత్సల్యరస మప్పటి దారిద్ర్యశీతర్తువుఁజేసి ఘనీభవించియుండనోపు. అట్టి సందర్భమున నే నేమియు నోరెత్త వలనుపడదయ్యె.

నా తండ్రి నన్నుఁ దనయొద్ద కొంచెముకాలమైన నుంచుకొని పోషింపఁడయ్యెను. ఎట్లో "రెమింగ్టన్ అండు సన్సు కంపెనీ" వారికి నేను జన్మించిన వార్త తెలిసెను. నన్నుఁ బెంచి పెద్దగఁ జేసికొనఁజాలని నా తండ్రి యా కంపెనీవారికి నన్నమ్మివైచెను. ఆ కంపెనీవారన్ననో నన్నుఁ దమ కన్నపుత్త్రికవలె ప్రేమమెయిఁ బెంచి పెద్దఁజేసిరి. ఆ కంపెనీవా రమెరికాలో న్యూయార్కు నగరమునఁ దుపాకులను దయారుచేయు కర్మాగారమున కధీశ్వరులు. వారు నా రూపమునుబోలిన రూపముగల యంత్రముల సృజించిరి. అంతట వారు నాకుఁ దమ ప్రసిద్ధకుటుంబము పేర 'రిమింగ్టన్ ముద్రాక్షర లేఖిని' అను నామకరణ మొనర్చిరి. నా తండ్రి పేరుకంటె నీపేరే సరిగనున్నది. చక్కని పేరనునది స్త్రీ కప్పటికప్పుడు లభించిన నగవంటిదని యొకకవి చెప్పెను.

నా పెంపుడు తండ్రి నాకు విశ్వమున వీను మిగిలిన పేరు రావలెనని కోరెను. అతఁడు బహు వ్యాపృతుఁడు. అగుట నన్నతఁడు ప్రపంచములోని మహామహులతోఁ బరిచయముగలదానినిగాఁ జేయుటలో శ్రద్ధవహింపఁడయ్యె. అందుచే నన్నుఁ బ్రచారము నిమిత్తమై న్యూయార్కునగల వైకాఫ్ సీమాన్సు బెనిడిక్టు అను కంపెనీవారి యధీనముజేసెను. ఈ కంపెనీవారు విరివిగ నన్ను ప్రపంచములో నన్ని స్థలములకు పంపి ప్రపంచమంతటితో పరిచయముగలదానినిగాఁ జేసిరి. నా యదృష్టమో, దురదృష్టమో చెప్పఁజాలను గాని నా పెంపుడు తండ్రిని కూడ విడువవలసినదాననైతిని. ప్రస్తుతపు రిమింగ్టన్ కంపెనీవా రిదివరలో ఇ. రిమింగ్టన్ అండు సన్సువారివద్దనుండి నన్ను కొనిరి. ఆనాటి నన్ను సహస్ర సంఖ్యముగ సృజించిరి. ఈ రిమింగ్టన్ కంపెనీవారు నన్ను ప్రేమతోఁ జూచుచున్నారు. ఏలయన నా వలన నత్యధికముగ ధనము నందినవారగుట నన్నెంత ప్రేమతోఁ జూచుచున్నారు. నే నీ కంపెనీవారికి మిగుల విధేయురాలనైన పుత్త్రికవలెనున్నాను. వీరు నా శరీరనిర్మాణమున నే యనేకములగు మార్పుల నొనర్చిరి. నన్నెన్నివిధముల వారు మార్చుచువచ్చినను నేనేమియు యడ్డు చెప్పఁజాలనైతిని. వంద్రెండుసారులు నా యాకారమును మార్చివైచిరి. నేను మనుష్యుని సృష్టిలోనిదాననగుట నిన్నివిధముల మార్పు నందవలసివచ్చినది.

మనుష్యుడు చేయు సృష్టిలో మార్పు నిశ్చయము. దైవసృష్టిలో నిన్ని మార్పులుమాత్రము రావు. ఎన్నెన్ని మారులు నే నేయేవిధముల రూపుభేదము నందితినో మీకు తెలిపెదను. నే ననేకములగు మార్పులకు లోనైతిని. కాని వారు చేసిన మార్పులన్నియు నా యభివృద్ధికిని సౌఖ్యమునకేయని చెప్పగలను. మొదట వారు నాకు రిమింగ్టన్ నం. 1 అని పేరిడిరి. అప్పుడు నేను మిగుల భారముగలదానను. నాతండ్రి పెంపకమున నే నంతపుష్టి నందగలిగితిని. అప్పటి నా శరీరనిర్మాణము మిగుల విస్తారముగనుండెను. నే నప్పు డుక్కుతో నిర్మింపబడితిని. అప్పుడు జనులకు నన్నుపయోగించుటన బిడ్డలయాటవలెనుండెడిదిగాదు. దృఢకాయులగువారుమాత్రము అక్షరములను గట్టిగా నొక్కిననేగాని (hard to touch) వ్రాయుదానను గాను. ఒకేవిధమైన అక్షరములు (Block letters) వ్రాయగల్గెడిదానను.

రెండవసారి నాకు రిమింగ్టన్ నం. 2 అని పేరిడిరి. ఇప్పటి యాకృతిలో మంచిమార్పు కల్గించిరి. ఇంగ్లీషు అక్షరములలో పెద్దఅక్షరములు (Capital) చిన్న అక్షరములు (small) వ్రాయునట్లు మార్పు చేసిరి. ఇప్పుడు 'షిఫ్ట్‌కీ' అను నొక నూతనాంగము కల్పించిరి. దీనివలన వలసినప్పుడు పెద్దఅక్షరములు, చిన్నఅక్షరములు వ్రాయుటకు వీలుకల్గింపబడినది. ఇప్పుడు తేలికగ చేయబడితిని. వ్రేలితాకునకు మిగుల ములుకుగలదాననైతిని. చాలవర కిప్పుడు నాబరువు తగ్గింపబడినది. అందుచే వారు నాకు మేలుచేయుచుండిరని తలచితిని.

మూడవసారి నాకు రిమింగ్టన్ నం. 3 అని పేరిడిరి. ఇప్పుడు నన్ను న్యాయవాదులకును న్యాయస్థానోద్యోగులకు ననుకూలించునట్లు సూక్ష్మరూపము గలదానినిగా మార్చిరి. అక్కౌంట్లును బేలెన్సుషీటులు తయారుచేయుట కనుకూలించునటులకూడ మార్చిరి.

నాలవసారి రిమింగ్టన్ నం. 4 అని పేరిడిరి. ఇప్పుడు పెద్దఅక్షరములు మాత్రమే వ్రాయుట కనువు కల్గింపబడినది.

అయిదవసారి నా యవయవనిర్మాణములో మార్పు కల్గింపబడినది. ఇప్పుడు రిమింగ్టన్ నం. 5 అను పేరుపొందితిని. ఈసారి యింగ్లీషు పత్రికప్రపంచములో మిగుల చలామణిగలదాననైతిని. ఇప్పుడు, వెనుకటివలె 76 అక్షరములుమాత్రమే వ్రాయుదానను గాక 84 అక్షరములు వ్రాయుదాన నగునట్లు చేయబడితిని.

ఆఱవసారియు యేడవసారియు చేయబడిన రూపములలో ననోన్యరూపసాదృశ్యము గలుగునట్లు మార్పులు కల్గింపబడెను. ఇప్పుడు 'రిబ్బన్' ధరించిన స్త్రీగామారి, యత్యధికమైన ములుకును పొందితిని. ఈసారి రిబ్బన్ యీవైపున నొకసారి యావైపున నొకసారి చుట్టుకొనునట్లు మార్పునందితిని. ఇప్పుడు నా యాకారమును నడకయు మిగుల మనోజ్ఞములయ్యెను. కాని నేను వ్రాయునది వ్రాయువేళ కనపడదయ్యెను.

ఏడవసారియు, యెనిమిదవసారియు మార్పులనొంది బారిస్టర్లకుకూడ నుపయోగపడునట్లు చేయబడితిని. ఈ రెండుసారులును మిగుల తేలికగఁ జేయబడితిని. రెండుసారులు గల్గిన మార్పు కూర్పులో 92 అక్షరములు వ్రాయుదాననైతిని. ఇప్పటి నుండి నేను వ్రాయునది వ్రాయువారలకు కనుపడునట్లు చేయబడితిని.

క్రమముగా వృద్ధినందిన కొలది క్రమసంఖ్యలు మారుచు చివరకు 'పండ్రెండు' సంఖ్యగలదాననైతిని. ఈ పండ్రెండవ సంఖ్యగల యీ నా యాకృతిలో, లోపలి యవయవనిర్మాణము వెలుపలికి కనపడకుండునటుల నుక్కురేకుతో మూయబడియున్నాను. ఇంతదనుక, అనాగరక చిహ్నముగు నా నగ్నతనువీడి నాగరక చిహ్నముగు నుచితవేషమున సంస్కృతినందితిని. ఈసారి యాకృతిలో ధ్వనియగుట తగ్గినది. 'అక్షరములతాకుట' తేలికయైనది. 'నడక' మిగుల లాలిత్యమునందినది. లౌకికవ్యవహారమంతయు నా

వలన నిపుడు జరుగుచున్నది. అబలాజనముకూడ అబలగామారిన నన్నుపయోగించి వ్రాయుటకు మిగుల నుత్సహింతురు. పియానాపై తమ వ్రేళ్లనుంచి వినోదముగ వాయించినట్లే అక్షరములపై వారి వ్రేళ్లనుంచి వినోదముగ వ్రాయుదురు. వారి యత్యల్పస్పర్శకే వ్రాయుదానవగు నన్నుపయోగించుటలో నేను చేయు నల్పధ్వని సహింతురు. పాశ్చాత్యదేశములలో నబలాజనమే యత్యధికముగ వ్రాయుటకు నన్నుపయోగించుచున్నారు. ఇప్పటికి నేను ప్రపంచమున తలపైకెత్తుకొని యిక నా కష్టములు తీరినవని చెప్ప సాహసించుచున్నాను. ఇప్పటికి నా జీవితములో స్థిరతగల్గినది. నన్ను లీలగ నుపయోగింపఁగల స్త్రీలు పాశ్చాత్యదేశములలో అత్యధికముగ ధనము సంపాదించుచు సౌఖ్యతరజీవితముల గడుప గల్గుచున్నారు. నేను వారికిఁ జేయుసేవకు ప్రతిఫలము కోరుటలేదు. నన్నుపయోగించు జనులు నన్నెప్పు డప్పుడు శుభ్రపఱచి ఘుర్షణములేక లీలగా నడుచుటకు నాకు తైలాభ్యంజనము చేయించవలసి యుందురు. కొంద ఱట్టిపనులఁ జేయరు. అయినను నేను సణఁగక గొణఁగక నా పనినిఁ జేయుచునే యుందును.

నా శరీరములో నైదు ముఖ్యమగు యంత్రభాగములు గలవు. 1. కీబోర్డు. 2. కేరేజి. 3. ఎస్కేప్ మెంటు. 4. రిబన్ మూవ్ మెంటు. 5. మెయిన్ స్ప్రింగు యంత్రము. ఇంతటితో నా కథ ముగించుచున్నాను. నేను విశ్వవ్యాప్తిగలదానను. నన్ను నీవద్దనుంచుకొనఁ వేని పురుషుఁడైనచో నేను నీకు చిల్లరకర్చులకు కొంతధనమును, నీ భార్య కర్చులకై కొంతధనమును సంపాదించియీయ సమర్థనని మనవి.

ఆంధ్రమహారాజా లోకరి సంకల్పఫలముగా 'ఆంధ్రముద్రాక్షరలేఖిని' మన 'యాంధ్రభూమి' నవతరించనున్నది. తదీయాత్మకథనాది శేషము లాంధ్రావని త్వరలో నెఱుంగగలదు.

('రిమింగ్టన్'ను యాత్మకథనము 'ఇండియన్ కామర్సు' అను పత్రికలోని వ్యాసమున కాంధ్రీకరణము.)

—:o:—

## సోదరీ!

పోలుకొండ భద్రయ్యగారు

భయములేదమ్మసోదరీ! భయములేదు
ఊరడిలుమమ్మసోదరీ యూరడిలుము!!
బేలతనమునఁజింతింప మేలుగాదు
వీరభారతిగర్భాన మీరిబుట్టి
పిరికితనమునువహియింప సరణిగాదు
పౌరుషజ్ఞానకీర్తుల బడయుమమ్మ!!
వరలుప్రాక్తనకాలపు వైభవమ్ము
నొక్కపరినాత్మఁజింతించి యోర్పుమమ్మ!
పరగపల్నాటికృష్ణుఁడన్ బేరుగన్న
మంత్రిబ్రహ్మనాయనివంటి మనుజవరుని
ముప్పుదిప్పలు బెట్టిన "ముగ్ధనాగ";
దేవగిరిరాజ ప్రభృతులదీటడంచి
శత్రుగజతతిపాలిపంచాస్యమనగ
కీర్తిచంద్రికల్ దిశలెల్ల గీలుకొల్పి
చెన్నుమీరిన "రుద్రమ" సన్నుతాంగి;
హీనుకగు తనపితకించుకేని వెరక
తన్నుమనసారప్రేమించి దనరినట్టి
ప్రాజ్ఞుఁడై సపృథ్వీ రాజప్రతిమ గళము
నందు పూమాలనుంచిన సుందరాంగి
"రాణిసంయుక్త" గుణయుతరాజకాంత;
వీరె యననేల పెక్కురువీరకాంత
లసదృశంబగు తమ కోర్కెలందలేదె!
అల్లదే సుప్రభాతము! ఆంధ్ర[illegible]
చరణసరసిజములజేరి సంతసిలుము!!